ప్రజాశక్తి
శనివారం 22 నవంబర్ 2025 5 అనంతపురం





చెట్ల మీదనే వదిలేసిన అరటితోటను పరిశీలిస్తున్న నాయకులు

# అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

**ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం**

జిల్లాలోని అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి తోటలను సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా నాయకులు వి. శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్రతో కలిసి రాంభూపాల్ పరిశీలించారు. గిట్టుబాటు ధరలేక తోటల్లో పంటను వదిలేసిన రైతులతో వారు మాట్లాడారు. బాధిత రైతు హనుమంతు మాట్లాడుతూ నాలుగున్నర ఎకరాల్లో అరటి సాగు చేయడానికి ఐదున్నర లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటసాగు చేస్తే కేవలం 45వేల రూపాయలు మాత్రమే చేతికి వచ్చిందని వాపోయారు. మూడు ఎకరాల్లో పంట సాగు చేస్తే కూలీల ఖర్చు కూడా రాలేదని మరో రైతు చిన్న ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు రాకపోవడంతో మూడు ఎకరాల అరటి పంటను పొలంలోనే వదిలేశానని నారాయణస్వామి అనే రైతు వాపోయారు. అనంతరం సిపిఎం రాష్ట్రనాయకులు రాంభూపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 వేల ఎకరాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారన్నారు. గిట్టుబాటు ధర లేక కోట్ల రూపాయల పెట్టుబడిని నష్టపోతున్నారని అన్నారు. కిలో 15 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ఉద్యానవన హబ్ అని ప్రభుత్వాలు మాటలు చెప్పడమే తప్ప కష్టాల్లో ఉన్న రైతులవైపు కన్నెత్తి చూడడంలేదన్నారు. గత సంవత్సరం నవంబరు నెలలో కిలో అరటి 22 రూపాయలు వుంటే, ప్రస్తుతం రెండు నుండి మూడు రూపాయలకు కొనే వారు లేరన్నారు. జిల్లావ్యాప్తంగా అరటి రైతులు దాదాపు 700 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడి పెడితే అందులో పావు భాగం కూడా తిరిగి రాకపోతే రైతులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లేక చేతికొచ్చిన పంటను గొర్రెలు పశువుల మేతకు వదిలేస్తున్నారన్నారు. అరటిరైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తే కిలో ఆరు రూపాయలకు తగ్గకుండా కొనాలని కలెక్టర్ వ్యాపారులను ఆదేశించారని అయితే పంట కొనేవారు మాత్రం లేరని అన్నారు. మన జిల్లా అరటి గల్ఫ్ దేశాలకు ఎగుమతయ్యే స్థితి నుండి రోడ్లపై వేసే స్థితికి దిగజారిందన్నారు.. మోడీ ప్రభుత్వం ట్రంపు ఆదేశాలకు తలొగ్గి ఎగుమతులను నిలిపివేయడంతో పొగాకు, పత్తి, అరటి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ అరటి రైతులను ఆదుకునే దిశగా జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు చొరవచూపాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను భ్రమల్లో పెట్టి వారినోట్లో దుమ్ము వేస్తోందన్నారు. ఈ సంవత్సర కాలంలో 45 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మార్చడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం వెంటనే జిల్లాల్లో అరటిపంటను టన్ను 15 వేల రూపాయలకు తగ్గకుండా కొనాలని అందుకు తగిన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి జీవితం మానవాళికి మార్గదర్శకం

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్



సత్యసాయి మహాసమాధి వద్ద మహారాష్ట్ర ముఖ్యమంత్రి, తదిత రులు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

సత్యసాయి బాబా జీవితం ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా మారిందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పేర్కొన్నారు. పుట్టపర్తిలో నిర్వహిస్తున్న సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవిస్ పాల్గొన్నారు. పుట్టపర్తికి వచ్చిన ఆయనకు కూటమి నాయకులు, అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉదయం మహారాష్ట్ర నుండి నేరుగా పుట్టపర్తి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రికి కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ బిజెపి నాయకులు ఎస్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పుట్టపర్తి విమానాశ్రయం నుండి నేరుగా ఆయన ప్రశాంతి నిలయం. చేరుకున్నారు. సాయి కుల్వంత్ హాల్‌లో త్యసాయిబాబా మహాసమాధిని దర్శించు కొన్నారు. అనంతరం అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ఆటో రిక్షాలు పంపిణీ :** శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మంది లబ్ధిదారులకు ఆటో రిక్షాలను పంపిణీ చేశారు. శ్రీ సత్యసాయి జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఒడిస్సా గవర్నర్ హరిబాబు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్ ,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు ఇతర ప్రముఖులతో కలిసి లబ్ధిదారులకు ఆటో రిక్షాలను పంపిణీ చేశారు..ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు, రామారావు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఒడిస్సా గవర్నర్‌కు ఘన స్వాగతం :** సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి వచ్చిన ఒడిస్సా గవర్నర్ కంభంపాటి డా .హరిబాబుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్ప గుచ్చం అందించి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సన్మానించారు. బాబా వేడుకల సందర్భంగా శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యువ సమ్మేళన సదస్సులో పాల్గొనేందుకు ఆయన విచ్చేశారు. అందులో భాగంగా పుట్టపర్తి శ్రీనివాస విశ్రాంతి భవనంలో ఉన్న గవర్నర్ కంభంపాటి డా.హరిబాబు ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ పల్లె సింధూర,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,బిజెపి నేత కేంద్ర యువ కేంద్ర కో ఆర్డినేటర్ సోమగుట్ట విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, టీడీపీ,బిజెపి జనసేన ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

**సమ్మేళన ప్రపంచ సదస్సు :** సత్య సాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సత్య సాయి గ్లోబల్ కౌన్సిల్, శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రెండవ రోజు జరిగిన యువసమ్మేళన ప్రపంచ సదస్సులో 45 దేశాల నుండి 2500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

**సరాస్ మేళా :** గ్రామీణ కళాకారులను, మహిళా సంఘ సభ్యుల ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గుర్తింపు తేవడానికి 'సరాస్'జాతీయస్థాయి మేళా ఎంతో ఉపయోగపడుతుందని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య పేర్కొన్నారు. సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మొట్టమొదటిసారిగా సత్యసాయి జిల్లాలో సరాస్ మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామీణ కళాకారుల, సంఘం మహిళా సంఘాల యొక్క వ్యాపారాలు, అమ్మకాల కోసం 300 రకాల ఉత్పత్తులతో 80 స్టాళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ స్టాళ్లను ఈనెల 15 నుండి 25వ తేదీ వరకు నిర్వహించనున్నామని వివరించారు.





స్టాళ్లలో ప్రదర్శించిన కళాకృతులు

# కౌలు రైతులకు బ్యాంకు రుణాలివ్వాలి

## ఎల్‌డిఎంకు కౌలు రైతు సంఘం నాయకుల వినతి



ఎల్‌డిఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలోని కౌలు రైతులకు పంటల సాగు కోసం బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎల్‌డిఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా గ్రామ సభల ద్వారా సిసిఆర్‌సి కార్డ్లు ఇవ్వాలన్నారు. 2019 సిసిఆర్‌సి చట్టం ప్రకారం కౌలు రైతులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. నూతన ప్రభుత్వం గతంలో అమలు చేసిన చట్టం ఆధారంగా గ్రామ సభల ద్వారా సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి పంట రుణాలు పంట నష్టపరిహారం, పంటల బీమా లాంటి పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు భూ యజమానులకు పంట సాగుకు ముందే ఎకరాకు కౌలు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లిస్తున్నారని తెలిపారు. మిరప, ఇతర పంటలు సాగుకు రూ.80 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు పెట్టుబడులు పెడుతూ దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో అప్పులు తీర్చే మార్గం కానరాక జిల్లాలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గ్రామ సభల ద్వారా కౌలు రైతులందరిని గుర్తించి సిసిఆర్‌సి కార్డ్లు ఇచ్చి ఆదుకోవాలన్నారు. హెచ్.ఎల్.సి, జి.బి.సి. లాంటి కాలువ రిపేరీలు చేయించి పిల్ల కాలువలను పూడికతీతను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని హంద్రీనీవా ద్వారా ఆయకట్టుకు సాగునీరు కేటాయించాలని కోరారు. ఉరవకొండ నియోజకవర్గంలో మిర్చి, పప్పుశనగలాంటి పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ఆగి విక్రయించుకునేందుకు వీలుగా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మన్నీల రామాంజనేయులు, ఆది, చంద్రశేఖర్ రెడ్డి, తిప్పే స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కంకర వేశారు..తారు మరిచారు..

## వాహనదారుల తిప్పలు

**ప్రజాశక్తి-యల్లనూరు**



కంకరమయమైన రోడ్డు

యల్లనూరు నుంచి గడ్డంవారిపల్లి వరకూ ఏడు కిలోమీటర్ల మేర కేవలం కంకర వేసి తారు రోడ్డు వేయడం మరిచారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.1.5కోట్లతో యల్లనూరు నుంచి గడ్డంవారిపల్లి వరకూ రోడ్డు వేస్తున్నారు. అయితే యల్లనూరు రెవెన్యూ పొలాల వరకూ రోడ్డు వేసి ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో అర్థాంతరంగా బిటి రోడ్డు పనులు ఆపేసినట్లు తెలుస్తోంది. దాదాపు నాలుగు నెలల క్రితం కాంట్రాక్టర్ కంకర వేసి వెళ్లిపోయాడు. కంకర రాళ్ల జారి ద్విచక్ర వాహనదారులు పలువురు కింద పడి గాయాలపాలవుతున్నారు. ఈ విషయం పలుమార్లు కాంట్రాక్టర్‌కు తెలిపినా స్పందించలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు వేయించాలని కోరుతున్నారు.




దీక్ష చేస్తున్న తాగునీటి కార్మికులు

# 'శ్రీరామిరెడ్డి' కార్మికులపై వివక్ష తగదు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులపై కక్షసాధింపు, వివక్షత తగదని సిఐటియు తాలుకా అధ్యక్షుడు రంగనాథ్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 5వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తాగునీటి పథకం నిర్వహణ దగ్గించుకున్న అడపాల వెంకట్రావు, ఆయన మనుషులమని చెప్పుకుని గౌతమ్, కిరణ్ బెదిరిస్తూ ఖాళీ బాండ్లపై సంతకాలు చేయించుకోవడం సహించమన్నారు. వెంటనే అలాంటి బాండ్లను కార్మికులకు తిరిగి వెనక్కు ఇవ్వాలని కోరారు. అలాగే పాలకులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో కార్మికులు రాము, లింగప్ప, నాగరాజు, తిప్పేస్వామి, లింగమయ్య, తిమ్మరాయుడు, ఎం.తిప్పేస్వామి, అజయ్, సి.తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎం. అరుణ్‌రషీద్

**ప్రజాశక్తి-అనంతపురం**

కళాశాల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరుణ్‌రషీద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఉరవకొండ ఆర్టీసీ డిపో వద్ద రహదారిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ నుంచి పాల్తూరు, గోవిందవాడ, బల్లగుడ్డంకు గ్రామాలకు కళాశాల సమయానికి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్న అరకొర బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడంతో ప్రమాదాలు ఏర్పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. సమస్యపై అనేకమార్లు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసినా స్పందించడం లేదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల అధ్యక్షులు రాజేష్, నాయకులు కిరణ్‌కుమార్, సురేష్, అనిల్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

# పారిశుధ్య కార్మికుల తొలగింపు దుర్మార్గం



భిక్షాటన చేస్తున్న నాయకులు, కార్మికులు

## ప్రభుత్వ విధానాలను విస్మరిస్తున్న పద్మావతి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి
## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్
## రోడ్డుపై భిక్షాటన చేస్తూ ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ప్రభుత్వ సర్వజనాసుపత్రి, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్ల తొలగింపు దుర్మార్గమని ఈ నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. జిజిహెచ్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు తమను తొలగించరాదని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రి గేటు వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 15వ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్, మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటిఎం.నాగరాజు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు, కార్మికులు సర్వజనాసుపత్రి వద్ద నుంచి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళుతూ రోడ్డుపై భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 15, 20 సంవత్సరాల నుంచి సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న స్వీపర్లు, సూపర్‌వైజర్లను అక్రమంగా తొలగించిన పద్మావతి ఏజెన్సీ ఎండి.భాస్కర్ నాయుడు తీరు దుర్మార్గమన్నారు.. రాష్ట్రంలో ఏ ప్రభుత్వంలోనైనా ఏజెన్సీ వారు కూడా ఏ ఒక్క కార్మికులు, సూపర్‌వైజర్లను తొలగించిన సందర్భం లేదన్నారు. అయితే పద్మావతి ఏజెన్సీ భాస్కర్ నాయుడు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన బంధువు అని చెప్పుకుంటూ రాయలసీమలో చలామణి కావడం జరుగుతోందన్నారు. ఇప్పటికే సిఐటియు ఆధ్వర్యంలో అనేక దఫాలుగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లా కలెక్టర్‌కు, గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసి న్యాయం చేయమని అడుగుతున్నా ఏ ఒక్కరూ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అందుకే ప్రజల దగ్గరికే వెళ్లి 'మా ఉపాధి పోయింది మా కుటుంబాలను ఆదుకోండి' అంటూ కార్మికులు సూపర్‌వైజర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపినట్లు తెలిపారు. ప్రజలు కూడా సహాయం చేసి మద్దతుగా నిలిచారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. కార్మికుల సమక్షంలోనే ఎండి భాస్కర్‌కు ఫోన్ చేసి తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని యథావిధిగా కార్మికులను సూపర్‌వైజర్లను కొనసాగించాలని చెప్పారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వీలైతే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వజన ఆసుపత్రి కార్మికుల యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నల్లమ్మ, నాగలక్ష్మి, ఎల్లమ్మ, ప్రమీల, రేఖ, జుబేదా, బీబీ, ఖాసింబీ, లక్ష్మణ్, రామాంజి, రఘు, శివ, దాదు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# చెరువులను నింపుతాం


## ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-పుట్లూరు**

రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని.. మండలంలోని చెరువులు అన్నింటినీ నింపుతామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలో ఉన్న సుబ్బారాయసాగర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇందులో భాగంగా గేట్లు పైకి లేవకుండా మొరాయిస్తున్న సమస్యపై సంబంధిత ఇంజినీర్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నలు నీరు వస్తుందా.. లేదా అని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎందుకంటే తాను రోజూ స్వయంగా ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్నానన్నారు. ముఖ్యంగా మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, జీసీ పల్లి చెరువులతోపాటు యల్లనూరు మండలంలోని బొప్పేపల్లి చెరువులను పూర్తిగా నింపే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో గేట్లకు కనీస మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే ప్రత్యేక నిధులు తెప్పించి కాలువల పనులు వేగంగా పూర్తి చేసిందన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా రైతులకు నీరు అందిస్తామన్నారు. సుబ్బారాయ సాగర్ వద్ద షట్టర్ గేట్లలో సాంకేతిక లోపాలు ఉండడంతో, కర్ణాటకలోని హొస్పేట నుంచి ప్రత్యేక నిపుణులను రప్పించి మరమ్మతులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు సింగిల్‌విండో అధ్యక్షులు కడవకల్లు గోవర్ధనరాజు, బ్రహ్మయ్య, ఇరిగేషన్ అధికారులు, రైతులు వీరయ్య, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



మార్కెట్‌కు వచ్చిన పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

# రైతాంగానికి ప్రభుత్వం పెద్దపీట

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

**ప్రజాశక్తి-గుత్తి**

కూటమి ప్రభుత్వం రైతన్నలకు అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో భారతీయ పత్తి సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 8శాతం తేమ ఉన్న పత్తి క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధర ఉందన్నారు. ముందుగా పండిన పత్తి పంటను రైతులు జాప్యం చేయకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. సాగు అయిన పంటల్లో అధిక దిగుబడులు వచ్చేలా రైతులకు సూచనలు ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 75 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరకు పత్తిని విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాస్, తహశీల్దార్ జి.పుణ్యవతి, మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనాయాదవ్, మార్కెటింగ్ ఎడి రాఘవేంద్ర కుమార్, ఎడిఎ వెంకటరాముడు, ఎఒలు పి.ముస్తాక్ అహ్మద్, టి.విజయ్‌కుమార్, మునికృష్ణ, ఎంపిటిసి జింకల నారాయణస్వామి, సర్పంచు యు.రామలింగమయ్య, మార్కెట్ యార్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్స్ ఉండాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అవకాశం ఉన్న ప్రతి ఇంటిపై పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కలిగించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మెప్మా అధికారులకు సూచించారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రధానంగా పీఎం సూర్య ఘర్, స్ట్రీట్ ఫుడ్స్, తప్ప క్యాంటీన్ల ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటి వరకు ఎంతమంది పీఎం సూర్య ఘర్ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు.. ఎంత మంది యూనిట్స్ ఏర్పాటు చేసుకున్నారన్నది ఆరాతీశారు. క్షేత్రస్థాయిలో ప్రతి గృహ వినియోగదారునికి ఈపథకంపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా దీనిపై అందిస్తున్న సబ్సిడీలు, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రాయితీలను గురించి తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై సోలార్ ద్వారా గృహానికి అవసరమైన విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు.

## కుష్టు వ్యాధి సర్వే తనిఖీ

**ప్రజాశక్తి-నార్పల**


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మండల పరిధిలోని పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న బొందలవాడ, దుగుమరి గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి కుష్టువ్యాధి గుర్తింపు సర్వేను ఎన్‌సిడిసి ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చర్మంపై స్పర్శ లేని రాగిరంగు మచ్చలు, పొడలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరములు, కాళ్లు, చేతులు కండరాల బలహీనత, చేతులు, పాదాలు, నరాల్లో తిమ్మిర్లు అనిపించడం, నొప్పిగా అనిపించని పుండ్లు, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవడం, చెవితమ్మెలు మందంగా మారడం, చర్మంపై వంటి లక్షణాలు ఉంటే గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని సూచించారు. అనంతరం బి.పప్పూరు వైద్యశాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం కుష్టువ్యాధి లక్షణాల సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, కిరణ్‌కుమార్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ వరలక్ష్మి, మహిళా ఆరోగ్య కార్యకర్త వెంకటశివమ్మ, ఆశా కార్యకర్తలు తులసమ్మ, లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే 'ప్రజాదర్బార్'

### విప్ కాలవ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, గుమ్మనూరు


మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-గుమ్మఘట్ట**

మండల పరిధిలోని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరగతిన పరిష్కరించడానికి ప్రజా దర్బార్ కార్యక్రమం చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆన్‌లైన్ చేసి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలు సమస్యలపై దాదాపు 150 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రజాక్‌వలి, ఎంపిడిఒ జయరాములు, ఆర్‌బి రామాంజనేయులు, డాక్టర్ సందేశ్, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ కాలవ సన్నన్న, గుమ్మఘట్ట సర్పంచ్ విజయలక్ష్మి, వీరాపురం సర్పంచ్ నాగరాజు, టిడిపి నాయకులు గిరి మల్లప్ప, సదాశివ, చిన్న కిష్టప్ప, బిటిపి మూర్తి, అంజి, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం కలెక్టరేట్ :** అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరితో ఓప్పిగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇందులో టిడ్కో నిర్మాణాలు, పింఛన్లు, రేషన్ కార్డులు తొలగింపు, భూ కబ్జా వంటి ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పి.ఎల్ఎన్.మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, రంగాచారి, కడియాల కొండన్న, పరమేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**గుత్తి :** నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (ప్రజాదర్బార్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబు ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు పట్టణాల్లో సమస్యలు ఉంటే ప్రజలు అర్జీ రూపంలో తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహశీల్దార్ జి.పుణ్యవతి, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, సిఐ ఎం.రామారావు, మార్కెట్ యార్డు చైర్మన్ జి.సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా యాదవ్, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీరంగయ్య, పి.సాంబశివయాదవ్, నాయకులు బర్దీవలి, బి.రమేష్, ఆర్ఎస్.రాజా, కోనంకి కృష్ణ, బి.నారాయణస్వామి, న్యాయవాది సోము, ఎ.గోవర్ధన్, బసినేపల్లి రామాంజి, చెట్నేపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయరామ్

## వసతిగృహాల నిర్వహణలో పారదర్శకత

### బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కోఠారి

**ప్రజాశక్తి-అనంతపురం**


మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కోఠారి

పారదర్శకంగా జిల్లాలోని వసతిగృహాలను నిర్వహిస్తున్నామని బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కోఠారి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని జిల్లా బీసీ స్టడీ సర్కిల్‌లో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, సమర్థత అత్యంత ముఖ్యమన్నారు. ప్రభుత్వం అన్ని సంక్షేమ శాఖల వసతి గృహాల పర్యవేక్షణ కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వసతి గృహాలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

## 'డ్రగ్స్ వద్దు బ్రో'పై అవగాహన

**అనంతపురం :** ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో'పై ఎస్ఐ వి.హనుమంతు ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మత్తుపదార్థాల వాడకంతో కలిగే నష్టాలు, డ్రగ్స్ వాడినా, అమ్మినా, రవాణా చేసినా చట్ట ప్రకారం శిక్షలను వివరించారు.

## శబరిమల యాత్రికులు జాగ్రత్తలు తీసుకోవాలి

**అనంతపురం :** శబరిమల వెళ్లే యాత్రికులకు తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ ఇబి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా నదుల్లో స్నానం చేసేటప్పుడు ముక్కులో నీరు వెళ్లకుండా మూసుకోవాలన్నారు. యాత్రికులకు ఒంట్లో నలతగా అనిపిస్తే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రం నుంచి వైద్య సహాయం తీసుకోవాలన్నారు. రెగ్యులర్‌గా వాడే మందులను తీర్థయాత్ర సమయంలో మానేయకూడదన్నారు. పరిశుభ్రమైన గోరువెచ్చని నీటిని మాత్రమే తాగాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయవద్దన్నారు.

## జెడ్పీ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు

**అనంతపురం :** జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం కింద పని చేస్తున్న తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయా ఉత్తర్వులను జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తన కార్యాలయంలోని ఛాంబర్‌లో ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.శివశంకర్, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.వెంకట సుబ్బయ్య, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చీరలు, దుప్పట్లు పంపిణీ

**గుత్తి :** పట్టణంలోని సత్య సాయి బాబా భజన మందిరంలో కమిటీ కన్వీనర్ ఎన్ వి.రమణ ఆధ్వర్యంలో పేదలకు చీరలు దుప్పట్లను పంపిణీ చేశారు. శ్రీ సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి బాబా కమిటీ నాయకులు తెగదొడ్డి తిమ్మారెడ్డి, కె.సత్యనారాయణ రెడ్డి, హెచ్ నాగరాజు, నరేంద్రరెడ్డి, కోనా ప్రదీప్‌రెడ్డి, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాల ఏర్పాట్లు పరిశీలన

**రాప్తాడు :** మండల కేంద్రంలో టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీమంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాల ఏర్పాటు పనులను ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం పరిశీలించారు. నియోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్‌తో పాటు పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక టిడిపి నాయకులతో కలిసి విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానిక నాయకులు ప్రతిపాదించారు. దీంతో పాటు వారు స్థలాలను పరిశీలించారు.

# ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు సురక్షితం

### ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-నార్పల**



గర్భిణులకు కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవడమే సురక్షితమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బండారు నారాయణస్వామి ఛారిటబుల్ ట్రస్టు తరపున గర్భిణులకు పండ్లు, చీర, పసుపు కుంకుమ, మిఠాయిలు, తదితర కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు వైద్యులు సూచించిన మేరకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు మాత్రలు తీసుకోవాలన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహాన్ని తీసుకోవాలన్నారు. అంతేగాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరి కిన్నెర, ఎండిపిఒ మమతాదేవి, ఐసిడిఎస్ సిడిపిఒ భారతి, ఎపిఎం తిప్పమ్మ, ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు యామియాభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దిగొచ్చేంత వరకూ ఉద్యమం

### వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి

**ప్రజాశక్తి-బెలుగుప్ప**


సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ముందుగా బెలుగుప్ప ప్రభుత్వ వైద్యకేంద్రంలో పని చేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందిన డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ విజన్ ఉన్న నాయకుడు అన్నారు. కాబట్టే 2019లో అధికారంలో అధికారంలోకి వచ్చాక పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మెడికల్ కళాశాలలు ఉండాలన్న లక్ష్యంతో 17 నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మూడేళ్లలోనే ఏడు కళాశాలలను అందుబాటులోకి తెచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, త్రిలోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పార్టీల శ్రీనివాసులు, మండల అధ్యక్షులు చిన్న మచ్చప్ప, గోవిందరెడ్డి, గుండ్లపాల్ నక్కలపల్లి సర్పంచు రామిరెడ్డి, గుండ్లపల్లి సర్పంచు పురుషోత్తం, రుద్రానంద, వెంకటరెడ్డి, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ

**ప్రజాశక్తి-రాయదుర్గం**


భూమిపూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంలోని టీచర్స్ కాలనీలో సిమెంట్ రోడ్డు, మురికి కాలువ నిర్మాణానికి విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో 15వ ఆర్థిక సంఘం, ప్రత్యేక నిధులతో రూ.4.15 కోట్లతో రోడ్లు, మురికి కాలువల నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిఇ సురేష్, ఎఇ నరసింహులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర, వార్డు సభ్యురాలు ప్రశాంతి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు హనుమంతురెడ్డి, ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు ఎన్.వెంకటేశులు, రాణిసత్రం పాలకమండలి అధ్యక్షులు వై.వెంకటేశులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు హనుమంతు, భారతి, సంపత్‌కుమారి, నాగరాజు, జమీల్‌ఖాన్, శివపసాద్, సుమలత, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

### ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**ప్రజాశక్తి-గుంతకల్లు**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నవజాత సంరక్షణ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న ఎనిమిది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక నవజాత శిశు సంరక్ష యూనిట్లను మంజూరు చేసిందన్నారు. అందులో గుంతకల్లుకు ఒక యూనిట్ మంజూరు కావడం ఇక్కడి పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ రమాదేవి, గుంతకల్లు టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, ఆసుపత్రి సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడికి పరామర్శ

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**


బాధితుడిని పరామర్శిస్తున్న టిడిపి నేతలు

వైసిపి నాయకుల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి అనంతపురం 3వ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జి గోపాల్‌ను టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, టిడిపి నాయకులు పరామర్శించారు. శుక్రవారం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపాల్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. గోపాల్‌పై దాడిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. పరామర్శించిన వారిలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, 10వ క్లస్టర్ ఇన్‌ఛార్జి శ్రీధర్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్ కుమార్, డివిజన్ నాయకులు నాగరాజు, కందుకూరి రాధా, మహమ్మద్ రఫీ, నజీర్, సువర్ణ, ఆరీఫా, విజయలక్ష్మి, జబి, కృష్ణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకులు పరిశోధనలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న విసి సుదర్శనరావు

**అనంతపురం :** అధ్యాపకులు రెగ్యులర్ విద్యాబోధనతోపాటు పరిశోధనలపై దృష్టి సాధించి యూనివర్శిటీ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు సూచించారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియులో పార్ట్‌నర్‌షిప్ ఫర్ ఆక్సిలేరాటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాంపై విపులంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ చంద్రశేఖర్‌శర్మ, ఇంజినీరింగ్ కళాశాల కెమికల్ ఇంజినీరింగ్ విభాగం కళ్యాణ్ కుమార్, ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మత్స్యకారులకు ప్రభుత్వ సహకారం

**ప్రజాశక్తి-గుమ్మఘట్ట**

మత్స్యకారులకు అందాల్సిన రాయితీలు, ఇతర సౌకర్యాలను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గుమ్మఘట్టలో మత్స్యకారులతో కలిసి కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో మత్సకారులను ప్రోత్సహిస్తూ వస్తున్నామన్నారు. భైరవాణితిప్ప ప్రాజెక్టులో ఇదివరకూ మూడు లక్షల చేప పిల్లల పెంపకాన్ని చేపట్టగా నేడు తొమ్మిది లక్షలకు పెంచామన్నారు. అలాగే కణేకల్లు చెరువులో కూడా పెద్ద సంఖ్యలో చేప పిల్లల పెంపకం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మత్స్యకారులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలని వినతి

**ప్రజాశక్తి-అనంతపురం**


ఎమ్మెల్యే సునీతకు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

కక్కలపల్లి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం పంచాయతీలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు నల్లాని రంగనాయకులు మాట్లాడుతూ కక్కలపల్లి కాలనీలో రోడ్డు, డ్రెయినేజీలు, ఐజి నగర్‌లో రోడ్డు, పింఛన్ల సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి మాజీ మండల కన్వీనర్ జయకృష్ణ, ఉపాధ్యక్షులు సూరి, వెంకటేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

**అనంతపురం :** అనంతపురంలోని సర్వజనాసుత్రి ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లైఓవర్‌పై గురువారం రాత్రి టిడిపి నాయకుల కారు ఢీకొనడంతో గాయపడిన ఇద్దరు యువకులను వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇందులో భాగంగా పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న పాతూరుకు చెందిన బాషా, ఆజాద్‌నగర్‌కు చెందిన ఇబ్రహీంను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై డిప్యూటీ ఆర్ఎంఒ డాక్టర్ హేమలత, డ్యూటీ డాక్టర్లతో వైద్య వివరాలను ఆరాతీశారు. అనంతరం సీఐ వెంకటేష్‌నాయక్‌తో రోడ్డు ప్రమాద ఘటనపై ఫోన్‌లో మాట్లాడి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'ఉపాధి' కూలీలకు ఈకెవైసి తప్పనిసరి

**ప్రజాశక్తి-గుమ్మఘట్ట**

ఉపాధి హామీ కూలీలు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ జయరాములు సూచించారు. అనర్హుల జాబ్‌కార్డులను తొలగించి అర్హులకు మాత్రమే జాబ్‌కార్డులు ఉండాన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈకెవైసికి శ్రీకారం చుట్టిందన్నారు. అందుకోసమే అర్హులైన వారికి ఈకెవైసి చేయించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపుగా 80 శాతం ఈకెవైసి పూర్తి చేశామని, మిగిలిన 20శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఒకవేళ జాబుకార్డుకు అర్హులు ఉన్నట్లయితే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సురేష్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గడ్డంవారిపల్లిలో గ్రామసభ


గ్రామసభలో పాల్గొన్న అధికారులు

**యల్లనూరు :** మండల పరిధిలోని గడ్డంవారిపల్లిలో అధికారులు శుక్రవారం స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి సర్వే నంబర్ 220లో 46 సెంట్ల పట్టా భూమి ఉండగా ఐదుగురు హక్కుదారులు ఉన్నారన్నారు. వారిలో ఒకరైన గంగరాజు పేరుపై ఆన్‌లైన్‌లో నమోదైందన్నారు. ఆన్‌లైన్‌లో అతని పేరు తొలగించి తన పేరుతో పట్టా ఇవ్వాలని కోరారు. ఈవిషయమై తహశీల్దార్ వివరణ కోరగా ప్రయివేటు భూమికి పట్టా ఇవ్వడం సాధ్యం కాదన్నారు.

## 'కిలిమంజారో'ను అధిరోహించిన కుసుమకు అభినందన

**ప్రజాశక్తి-నార్పల**


కుసుమకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

దక్షిణాఫ్రికా దేశంలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మండల పరిధిలోని దుగుమరి గ్రామానికి చెందిన 19 ఏళ్ల కుసుమను శుక్రవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభినందించారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం అందించారు. ఇందులో భాగంగా రానున్న రోజుల్లో ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని కుసుమ ఎమ్మెల్యేకి తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ కూటమి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అతేగాకుండా మహిళలు ఎందులోనూ తక్కువ కాదని కుసుమ నిరూపించడం హర్షించదగ్గ విషయమన్నారు.

## అరటిరైతుల అరణ్యరోదన పట్టదా..?


### వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**


అరటి తోటను పరిశీలిస్తున్న తలారి రంగయ్య

రూ.లక్షలు ఖర్చు పెట్టి అరటి పంట సాగు చేసిన రైతులు ధరలు పతనమై తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి పట్టడం లేదని వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని బోరంపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి, మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించి రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి పంటను కిలో రూ.2కు కూడా కొనేవారు లేకపోవడం బాధాకరమన్నారు. దీంతోపాటు మొక్కజొన్నను క్వింటా రూ.1700 అడుగుతున్నారన్నారు. కావున ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మారుతమ్మ, సర్పంచులు శోభారాణి, హనుమంతప్ప, కన్వీనర్ చంద్రశేఖర్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ దొడగట్ట నారాయణ, నాయకులు కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, బలరామ్, సంజప్ప, ఉదయ్, వార్డు సభ్యులు వన్నూరుస్వామి, హరి, తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి క్విజ్ పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు


**గుంతకల్లు :** వచ్చేనెల 14న పట్టణంలోని శంకరానంద జూనియర్ కళాశాలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎపిజె అబ్దుల్ కలాం క్విజ్ కాంపిటీషన్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆబిద్ స్కానింగ్ సెంటర్ డాక్టర్ ఆర్షద్, అడ్వకేట్ రమేష్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు, బాయ్స్ హై స్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు,జిలాన్,ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకుడు టిడిపిలో చేరిక

**బెలుగుప్ప :** మండల పరిధిలో విరుపాపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు మారుతీప్రసాద్ శుక్రవారం అనంతపురంలోని పయ్యావుల శ్రీనివాసులు స్వగృహంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో సంక్షేమం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటోందన్నారు. వీటికి ఆకర్శితుడినై టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేష్, వన్నూరుస్వామి, పవన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన వీరేష్

**రాయదుర్గం :** గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన చాకలి వీరేష్ (45) శుక్రవారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాష్ట్ర సరిహద్దున కర్ణాటక రాష్ట్రంలోని కొండ్లహళ్లి వద్ద మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి వస్తుండగా వాహనం అదుపుతప్పి కింది పడ్డాడు. దీంతో తీవ్రగాయాలై దుర్మరణం చెందాడు. వీరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### ఐచర్-ద్విచక్ర వాహనం ఢీ..వ్యక్తికి గాయాలు

**నార్పల :** మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్ సమీపంలో తాడిపత్రి రోడ్డులో ఐచర్-ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కొండాపురానికి చెందిన పవన్ తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషయంగా మారడంతో 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గడ్డివామి దగ్ధం

**యాడికి :** మండల పరిధిలోని దైవాలమడుగు గ్రామం రైతు పుల్లారెడ్డికి చెందిన గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పు పెట్టడంతో పర్తిగా కాలిబూడిదైంది. దీంతో సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతు పుల్లారెడ్డి వాపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకని పరిశీలించారు.

### వ్యవసాయ కూలీలపై దూసుకెళ్లిన ట్రాక్టర్

**బ్రహ్మసముద్రం :** మండల పరిధిలోని చెలిమేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ రైతు పొలంలో పని చేస్తున్న ముగ్గురు వ్యవసాయ కూలీలపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. చెలిమేపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మొక్కజొన్నల గడ్డలు తొలగించేందుకు 20మంది కూలీలు పని వెళ్లారు. ఇందులో భాగంగా మొక్కజొన్న కంకులను ట్రాలీలో వేస్తున్న క్రమంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ముగ్గురు వ్యవసాయ కూలీలపై దూసుకొచ్చింది. అప్రమత్తమైన ఇతర వ్యవసాయ కూలీలు వెంటనే ట్రాక్టర్‌ను ఆపడంతో పెనుప్రమాదం తప్పింది. ఈఘటనలో వేపులుపర్తి గ్రామానికి చెందిన మల్లమ్మ, కురుబ అనసూయ, తిప్పమ్మకు గాయాలయ్యాయి. వీరిని అనంతపురం సవేరా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ముగ్గురిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.



నిత్యావసర సరుకులను అందజేస్తున్న నిర్మలమురళి

## నిత్యావసరాలు అందజేత

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మలమురళి ఆధ్వర్యంలో పేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసులు, సతీమణి ధనలక్ష్మి కుమారుడు వికాస్ పుట్టినరోజు సందర్భంగా నిత్యావసరాలకు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య రక్షణకు డ్రై డే పాటించాలి

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీ, రాయల్ కాలేజ్ పరిధిలోని కాలనీల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటి పాత్రలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఆరోగ్య సహాయకులు ఎర్రిస్వామి, సూర్యనారాయణ, రవి, రాజు, శ్రీనివాసులు, ఆరోగ్య కార్యదర్శులు సుజాత, ప్రమీల, విజయలక్ష్మి, సునీత, ఆశా కార్యకర్తలు సుశీల, యశోద, విజయలక్ష్మి, జ్యోతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్

**రాయదుర్గం :** వచ్చేనెల 13వ తేదీన రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడే క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్నవి, లేని సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆయా సమస్యలతో సతమతవుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సివి రామన్‌కు నివాళి

**గుత్తి :** పట్టణంలోని పెన్షనర్ల భవనంలో సివి రామన్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె. అబూబకర్, కోశాధికారి జెన్నే కుళ్లాయిబాబు, ఉపాధ్యక్షులు షేక్షావలి, స్వర్ణాంబ, కార్యదర్శి రామ్మోహన్, నాయకులు నారాయణరెడ్డి, గోవిందప్ప, నారాయణశెట్టి, లక్ష్మీనారాయణరెడ్డి, దేవదాసు, శామ్యూల్, నరసింహులు, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్పోర్ట్స్ డే

**కళ్యాణదుర్గం రూరల్ :** కళ్యాణదుర్గం శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో విద్యాసంస్థల అధినేత బిఎస్.రావు స్మారక బ్రాంచ్ లెవెల్-1 స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గెలుపొందిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ తిరుమలేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఫిలీప్‌కుమార్‌రెడ్డి, డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇన్‌ఛార్జి లీలావతి, కల్చరల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డాన్స్ మాస్టర్ రామకిష్ట, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి హేమలత, పిఇటి అశోక్, హరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

# గ్రామాల స్వచ్ఛతే అందరి లక్ష్యం

### గ్రీన్ అంబాసిడర్ల శిక్షణలో వక్తలు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

గ్రామాల స్వచ్ఛతే అందరి లక్ష్యమని ఎంపిపి మారుతమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని బోరంపల్లి గ్రామంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత విషయంలో అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో వందశాతం శానిటేషన్ నిర్వహించడం సంతోషకరమన్నారు. అంతకుముందు సర్పంచు శోభారాణి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపిడిఒ ధనుంజయ, ఇఒఆర్‌డి రంగయనాయకులు ఇంటింటికీ వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా ఎలా తీసుకోవాలనే విషయాలను వివరించారు.

**నార్పల :** మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పరిశుభ్రత పచ్చదనం పెంపొందించడంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఇందులో భాగంగా ఎంపిడిఒ మమతాదేవి ఆధ్వర్యంలో స్థానిక కోటవీధి, అంబేద్కర్ కాలనీ, బేల్దారి కాలనీ, సుల్తాన్‌పేట, తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శ్యామల, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శేషారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుభాన్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, టైపిస్ట్ జగన్నాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటరమణ, పరుశురాం, గోపాల్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, లక్ష్మీదేవి, రాజేశ్వరి, కీర్తన, సింధూజా, గౌతమి, కుళాయప్ప, చంద్రమాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**బ్రహ్మసముద్రం :** మండల పరిధిలోని భైరసముద్రం గ్రామంలో పరిశుభ్రత-పచ్చదనంపై గ్రీన్ అంబాసిడర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఉమాదేవి పరిశుభ్రత, పచ్చనైన గ్రామంపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్, శిక్షణ టిఒటి పంచాయతీ అభివృద్ధి అధికారి యోగేష్, భైరసముద్రం పంచాయతీ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బొమ్మనహాల్ :** మండల పరిధిలోని శ్రీధర్‌ఘట్ట గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఎంపిడిఒ విజయభాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకే గ్రీన్ అంబాసిడర్లు మూడు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు యోగేశ్వరరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బలరామ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై శుక్రవారం మండల కేంద్రంలో క్లాప్‌మిత్ర, సిఆర్‌పిలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, డిప్యూటీ ఎంపిడిఒ సాదిక్‌వలి, ఎఒ నాగకృష్ణయ్య, మండల పరిషత్ సిబ్బంది ప్రభాకర్, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, మగ్బూల్‌బాషా, రామాంజనేయులు, మల్లేష్, పంపనూరు శిరీషా, శిరీషా, సునియాస్, మురళి, కమల్, ఎంసిఒ



ఆత్మకూరులో చెత్తను సేకరిస్తున్న కార్మికులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ మారుతమ్మ

ఆరోగ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పచ్చదనం, పరిశుభ్రతపై మూడురోజులపాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు :** మండలంలోని 25 పంచాయతీలకు సంబంధించిన అధికారులు, కార్మికులకు శుక్రవారం స్వచ్ఛరథం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బారన్‌సాహెబ్, ఇఒఆర్‌డి శ్రీదేవి, ఎపిఒ విజయభారతి, పంచాయతీ కార్యదర్శులు పుష్పావతి, ఆంజనేయులు, ప్రణీత్, బన్నీ, మధు, తదితరులు పాల్గొన్నారు.

**యాడికి :** మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛరథంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వీరరాజు, ఇన్‌ఛార్జి ఇఒ, డిప్యూటీ ఎంపిడిఒ శశికళ, టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షులు తీరంపురం నీలకంఠ, తదితరులు పాల్గొన్నారు.

**యల్లనూరు :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, హరి, హర్షవర్ధన్‌రెడ్డి, యమున, నాగలక్ష్మి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి శైలజనాథ్‌కు మాతృవియోగం

**నార్పల :** మాజీమంత్రి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజానాథ్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి సాకే గంగమ్మ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, తదితరులు అనంతపురంలోని నాయక్‌నగర్‌లో ఉన్న శైలజానాథ్ ఇంటికి చేరుకుని గంగమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల కన్వీనర్ ఖాదర్ వలిఖాన్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు పట్నం ఫణీంద్ర, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

### వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను తక్షణమే రెన్యువల్ చేయాలని, లేనిపక్షంలో 35 కిలోమీటర్ల మేర మానవహారం చేపడతామని వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న సంక్షేమ పథకాలు అమల్లో 'మూడు అడుగుల ముందుకు.. రెండడుగులు వెనుక్కు' అన్న చందనంగా నడుస్తున్నాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆగర్భ శ్రీమంతుడని ప్రగల్భాలు చెబుతూ సొంత నిధులు ఖర్చు చేస్తున్నామని పేదల జేబుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దొడగట్టి నారాయణ, కన్నేపల్లి సర్పంచు గంగమ్మ, ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి సునందమ్మ, బ్రహ్మసముద్రం, కంబదూరు, శెట్టూరు మండలాల కన్వీనర్లు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంతురాయుడు, హనుమంతరాయుడు, పోలేపల్లి సర్పంచు మంజునాథ్, నాయకులు పళ్లెప్ప, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తలారి రంగయ్య

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేష్ రాయల్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇటీవల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల పునర్నిర్మాణంలో భాగంగా అన్ని సబ్జెక్టుల పాఠశాల సహాయకుల సమావేశం మండల కేంద్రాల్లో మాత్రమే నిర్వహించడం సబబు అన్నారు. అయినప్పటికీ ఒక్కో పాఠశాల 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల ఫేషియల్ అటెండెన్స్ వేయడానికి సమయం ఇవ్వాలన్నారు. సెలవు రోజుల్లో పదవ తరగతి నూరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మినహాయించాలన్నారు. గత సంవత్సరం నూరు రోజుల శిక్షణా కార్యక్రమంలో పని చేసిన ఉపాధ్యాయులకు నేటి వరకు సిసిఎల్ ఇవ్వలేదని తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించి 12వ పీఆర్‌సి కమిటీ నియమించాలన్నారు. త్వరితగతిన నివేదికను సమర్పించేందుకు విస్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. 11వ పీఆర్‌సి బకాయిలు, ఇతర ఆర్థిక బకాయిలు, డిఏలు వెంటనే చెల్లించాలన్నారు. మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ మినహాయింపుపై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. సర్వీస్ రూల్స్ పరిష్కరించి పదోన్నతులు ఇవ్వాలన్నారు.బోధనేతర పనులు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇతర కార్యక్రమాలను ఉపాధ్యాయుల నుంచి తప్పించి తగిన బోధనేతర సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, నాయకులు తిమ్మప్ప, చెన్నకేశవులు, చిదంబ రెడ్డి, తిప్పేస్వామి, రామ్మూర్తి, నజీర్, అహ్మద్, కలీముల్లా, నాగరాజు, సోహైల్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్